ప్రజాశక్తి
బుధవారం 16 నవంబర్ 2022
5
పార్వతీపురం మన్యం



నేటి నుంచి గిరిజన విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజన విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు ఈనెల 16 నుంచి జరుగుతాయని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బి.సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జన జాతీయ గౌరవ దినం సందర్భంగా పార్వతీపురం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బాడ్మింటన్, ఆర్చరీ, అథ్లెటిక్స్‌తో పాటు, వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, డాన్స్ మొదలగు విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో విజేతలు ఈనెల 18 నుంచి 21 వరకు విశాఖలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. క్రీడలు పర్యవేక్షణ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఎం.వాసుదేవరావు నాయుడు ఆధ్వర్యంలో సాంస్కృతిక విభాగానికి సంబంధించి పోటీలు సిహెచ్ మోహన్ రాయుడు ఆధ్వర్యంలో జరుగనున్నాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు

- 1,2 తరగతులకు స్మార్ట్ టివిలు
- ఇంటి నిర్మాణం ప్రారంభించకపోతే రద్దు : మంత్రి బొత్స

ప్రజాశక్తి-గరివిడి

వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో 3వ తరగతి నుంచి డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. 1,2 తరగతులకు స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేస్తామన్నారు. వీటి రక్షణ కోసం ప్రతీ పాఠశాలకు ఒక వాచ్‌మెన్‌ను నియమించడమే కాకుండా, సిసి కెమెరాలను కూడా అమర్చనున్నట్లు వెల్లడించారు. ఎంపిపి మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన గరివిడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా దశలవారీగా అన్ని పాఠశాలల్లో మౌలిక, అధునాతన సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. సంక్రాంతిలోగా రాష్ట్రంలోని సుమారు 5 లక్షల మంది 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. సభ్యుల సూచనల మేరకు ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం కోసం ప్రతి శనివారం ఒక పీరియడ్‌ను కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు వారంలో రెండు రోజులు పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, తరగతుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించాలని కోరారు. ఇళ్లు నిర్మించని వారికి నోటీసులు ఇచ్చి, డిసెంబరు 15 వరకు గడువు ఇవ్వాలని, అప్పటికీ నిర్మాణాన్ని ప్రారంభించకపోతే రద్దు చేయాలని ఆదేశించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి, ప్రతిపాదిత పనులన్నిటినీ త్వరలో మంజూరు చేస్తామని చెప్పారు. సమావేశంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జెసి మయూర్ అశోక్, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాలకొండ డివిజన్ కేంద్రం కావడంతో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా లేఅవుట్లు ఏర్పడ్డాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా అనధికారంగా లే అవుట్లు వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్‌కె రాజపురం వద్ద అనధికారికంగా ఉన్న లేఅవుట్



దారితప్పిన టౌన్‌ప్లానింగ్ విభాగం

- విచ్చలవిడిగా అనధికార లేఅవుట్లు
- అధికారుల చర్యలు శూన్యం

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

పట్టణంలో లక్షల్లోనే భూముల ధర పలుకుతుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం పాలకొండలో ఎక్కువ జరుగుతుండడంతో ప్రజలు పలు మోసాలకు గురయ్యే పరిస్థితి ఎదురవుతుంది. నగర పంచాయతీ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా దారితప్పిపోవడంతో అనధికార కట్టడాలు ఎక్కువవుతున్నాయి. అదే విధంగా అక్రమ లేఅవుట్లు కూడా వెలుస్తున్నాయి. దీనిపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడని ధోరణిలో నడుస్తున్నారు. ఎక్కడికక్కడ లేఅవుట్లు వేస్తున్నా ఎక్కడా నిబంధనలు పాటించే పరిస్థితి కనిపించడం లేదు.

అనధికార లేఅవుట్లు....

పట్టణంలోని అనేక ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లుఉన్నాయి. ఎన్.కె.రాజపురం జంక్షన్, జగన్నాధస్వామి ఆలయానికి వెళ్లే రహదారితో పాటు వడమ ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లు ఉన్నట్లు తెలుస్తోంది. కనీస నిబంధనలు పాటించకుండా లేఅవుట్లు వేసి ప్లాట్లుగా ప్రజలకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. నగర పంచాయతీ నిబంధనలు పాటించకుండా రైతుల దగ్గర కారుచౌకగా భూములు కొనుగోలు చేసి ప్రజలకు ప్లాట్లు రూపంలో లక్షలాది రూపాయలకు వ్యాపారులు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. అంతర్గత రహదారి 20 అడుగులు, ప్రధాన రహదారి 40 అడుగులతో పాటు కాలువలు, సామాజిక అవసరాలకు 10శాతం స్థలాన్ని కేటాయించాల్సి ఉన్నప్పటికీ అటువంటి చర్యలు తీసుకునే దాఖలాల్లేవు. నిబంధనలకు పాతరవేసి ఇష్టానుసారంగా వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. పట్టించుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనధికార కట్టడాలెన్నో....

నగర పంచాయతీ పరిధిలో అనధికార కట్టడాలు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఆస్పత్రి రోడ్డులో ఇటీవలే కింద షాపులు, పైన ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా దానికి ఎటువంటి అనుమతులు లేవని సమాచారం. కనీసం ప్లాన్ ఆమోదం కూడా జరగకుండానే నిర్మాణం జరుగుతున్నట్టు తెలుస్తోంది. అదే విధంగా కాంప్లెక్స్ పరిసరాల్లో కూడా ఎటువంటి అనుమతుల్లేకుండా భవనాలు నిర్మాణాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. దీంతో ప్రజలు పలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

చెరకు బకాయిలు చెల్లింపు

రైతుసంఘాలు, రైతులు హర్షం

ప్రజాశక్తి - కలెక్టరేట్

సీతానగరం మండలం లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగార యాజమాన్యం చెరకు రైతులకు చేయాల్సిన మిగులు బకాయిలు రూ.3,87,60,894కు చెల్లింపునకు కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం ఆమోదం తెలియజేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వెంటనే పెదబోగిల స్టేట్ బ్యాంకులో 1,111మంది రైతుల బకాయిల మొత్తం డబ్బులకు సంబంధించిన చెక్కులను సీతానగరం తహశీల్దార్ ఎంవి రమణ, సుగర్ కేన్ డిప్యూటీ కమిషనర్ సంతకాలు చేసి జమచేశారు. 2019 - 20, 2020 - 21 గానుగ సీజన్లో చెరకు రైతులకు యాజమాన్యం రూ.16కోట్ల 84లక్షల 88 వేల 385 బకాయిలు ఉండగా రైతు సంఘాలు, రైతులు ఆందోళన చేయడంతో ఆర్ ఆర్ యాక్టు అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరి 9న వేలంపాట జరగడం, బొబ్బిలికి చెందిన ధాత్రి రియల్ ఎస్టేట్ అండ్ డవలపర్స్ సంస్థ రూ.20కోట్ల 5 లక్షల రూపాయలకు ఎన్‌సిఎస్ భూములను వేలంలో దక్కించుకోవడం జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, అప్పటి సబ్ కలెక్టర్ భావన, డిఆర్ఒ జె.వెంకటరావు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా మొదటి విడతగా మేలో రూ.9 కోట్ల 20 లక్షలు చెల్లించారు. రెండో విడతగా జూన్‌లో రూ.3 కోట్ల 87 లక్షల 60 లక్షల 894ను చెల్లించగా, మిగిలిన బకాయిల మొత్తం మూడో విడతగా రూ.3 కోట్ల 87 లక్షల 60 వేల 894ను అధికారులు మంగళవారం బ్యాంకులో జమచేశారు. చెరకు రైతులకు రావాల్సిన బకాయిలు పూర్తిగా అందడంపట్ల రైతు సంఘం నేతలు, రైతులు హర్షం వ్యక్తంచేశారు.

హెచ్‌ఎంపై పోక్సో, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - సాలూరు

మండలం లోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావుపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పాఠశాల బాలికల ఫిర్యాదు మేరకు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పారు. ఆయనపై ఫోక్సో కేసు నమోదు చేసినట్టు సోమవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రకటించారు.



ఏదైనా ఒక పని చేయాలంటే ప్రణాళిక ఉండాలి. ప్రభుత్వ అనుమతులు అంతకన్నా ముఖ్యం. ప్రజామోదం తప్పనిసరి. ఆపై ప్రజలకు ఎంతో ప్రయోజనమైన పనులైనా నిబంధనలకు లోబడి చేపట్టాలి. కానీ, ఇవేవీ పట్టించుకోకుండానే పనులు చేపట్టడం, ఆపై బిల్లులకు సిద్ధపడడంతో బాగోతం రచ్చకెక్కింది. పూసపాటిరేగ మండలంలో చోటు చేసుకున్న ఈ పరిణామం హాట్‌టాపిక్‌గా మారింది. కలెక్టర్ ఆదేశంతో డిఆర్‌డిఎ పీడీ కొద్దినెలల క్రితం విచారణ చేపట్టారు. చాలా పనులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినట్టు ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. ఇదే మండలంలో చేపట్టిన మెటీరియల్ కాంపొనెంట్ పనులపై వచ్చిన అభియోగాలపై విచారణ చేపట్టేందుకు రాష్ట్ర కేంద్రం నుంచి త్రిసభ్య కమిటీ బుధవారం రానుంది. దీంతో, పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఇంతకీ ఏం జరిగిందంటే...

అంచనాలు లేకుండా..ఆమోదం పొందకుండా...

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/పూసపాటిరేగ

కొద్ది నెలల క్రితం కుమిలిలో శ్మశానవాటిక నిర్మాణం జరకుండానే రూ.6.50లక్షలు దుర్వినియోగం జరిగిందని ఆరోపణలు వచ్చాయి. దీంతో, కలెక్టర్ సూర్యకుమారి అప్పటి వరకు పూసపాటిరేగ మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న డ్వామా పీడీని తప్పించారు. ఆ స్థానంలో డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్ చక్రవర్తిని నియమించారు. మెటీరియల్ కాంపొనెంట్ నిధుల వినియోగంలో అక్రమాలు జరిగినట్టు అభియోగాలు ఎక్కువ కావడంతో అదే మండలంలోని మరికొన్ని గ్రామాల్లో జరిగిన పనులపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఆదేశించారు. దీంతో, రంగంలోకి దిగిన చక్రవర్తి మొత్తం 9గ్రామాల్లో జరిగిన పనులపై క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన నివేదిక ప్రకారం... కుమిలి నుంచి నాగంపేట ఆర్‌అండ్‌బి రహదారి వరకు చేపట్టిన రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉన్నప్పటికీ పరిపాలనా అనుమతులు తీసుకోలేదు. దీంతో, ఈ పనికి సంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదు. పతివాడ, పశుపాం జిల్లా పరిషత్ స్కూళ్లల్లో భూమిని చదును చేసేందుకు గ్రామ సభ తీర్మానంగానీ, పరిపాలనా అనుమతులుగానీ లేవు. పని మాత్రం పూర్తయ్యింది. కానీ, ఎన్ఆర్ఇజిఎస్ నిబంధనలకు విరుద్ధంగా ఈ పనులు జరిగాయి. చౌడువాడ శ్మశానవాటిక, చౌడువాడ గ్రావెల్ రోడు పనులకు సంబంధించి కూడా తీర్మానాలు, అనుమతులు లేవు. మస్తర్లు జారీ చేసినప్పటికీ పనులు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయి. ఏరుకొండలో స్లాబ్ కల్వర్టు, వెంపడాంలో పైపు కల్వర్టులు, తూములు, గ్రావెల్ రోడ్డులు, విలేజ్‌పార్కులు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆ నివేదికలో పేర్కొన్నారు. మండలంలోని మరికొన్ని గ్రామాల్లో జరిగిన పనితీరును కూడా చక్రవర్తి తన నివేదికలో పొందుపర్చారు. ఈనేపథ్యంలో వీటిపై మంత్రి బొత్స, జిల్లాలోని కీలక నేతలు సీరియస్‌గా ఆరా తీస్తున్నట్టు చర్చ నడుస్తోంది. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే విధంగా వ్యహరిస్తే ఊరుకునేది లేదంటూ ఇటీవల అటు మంత్రి, ఇటు జెడ్‌పి ఛైర్మన్ ఎక్కడికక్కడ హెచ్చరిస్తున్న విషయం విధితమే. మరోవైపు ఇక్కడి పరిణామాలపై ఆరా తీసిన పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ ఆరా తీశారు. ముగ్గురు అధికారులతో కూడిన విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ బుధవారం జిల్లాకు వస్తున్నట్టు సమాచారం. కమిటీ మొత్తం వ్యవహారంపై దృష్టి పెడుతుందా? లేక ఒకటిరెండు పనుల పరిశీలనకు పరిమితమౌతుందా? వేచిచూడాల్సిందే. ఏదేమైనా కమిటీ రాకతో అభియోగాల్లో వాస్తవమెంత? వాటిలో అధికారులు, అనధికారుల పాత్ర ఏమేరకు ఉందనేది స్పష్టమౌతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

- ఎన్ఆర్ఇజిఎస్ నిధుల వినియోగంలో అడగడుగునా అభియోగాలు
- డిఆర్‌డిఎ పీడీ విచారణలో వెలుగులోకి
- నివ్వెరబోతున్న ప్రజానీకం
- నేడు రాష్ట్ర కేంద్రం నుంచి విచారణ కమిటీ రాక

అటవీ హక్కుల చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టబోతున్న అటవీ హక్కుల చట్ట సవరణను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా రావాడ కూడలి వద్ద అటవీ హక్కుల చట్ట సవరణ జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తూ వారికి నష్టాన్ని కలిగించే వ్యతిరేకమైన చట్టాన్ని తెస్తుందని అన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే 1/70 చట్టం రద్దవుతుందని, అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు పట్టాలివ్వకుండా అడ్డుకుంటూ గిరిజనుల భూములన్నీ కార్పొరేట్, పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిపోతాయని అన్నారు. గిరిజన హక్కులకు భంగం కలిగించే చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లిగంగు నాయుడు, గిరిజనులు పాల్గొన్నారు.

మక్కువ మండలం దుగ్గేరులో జీవో ప్రతులను రైతుకూలీ సంఘం ఆధ్వర్యాన గిరిజనులు దహనం చేశారు. తొలుత బిర్సా ముండా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఉయ్యక ముత్యాలు మాట్లాడారు. కేంద్రం తీసుకొస్తున్న చట్టాల వలన కలిగే నష్టాలను వివరించారు.



జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఘనంగా బిర్సా ముండా జయంతి సభ

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రమైన సీతంపేటలో బిర్సా ముండా 147 జయంతి సభ ఎపి గిరిజనసంఘం ఆధ్వర్యాన ఘనంగా జరిగింది. స్థానిక ఎపి గిరిజన సంఘం కార్యాలయంలో జీలకర్ర శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సభలో సంఘం కార్యదర్శి బిడ్డిక అప్పారావు మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడిన ఆదివాసీ ధీరుడు బిర్సా ముండా అని కొనియాడారు. నేడు మోడీ ప్రభుత్వం 2022 అటవీ హక్కుల సంరక్షణసవరణ బిల్లు తెచ్చి అడవులన్నీ కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలని చూస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు ఆదివాసీలు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం సీతంపేట సెంటర్‌లో 2022 అటవీ సంరక్షణ సవరణ బిల్లు పత్రాలను గిరిజన సంఘం ఆధ్వర్యంలో దగ్ధంచేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి.సాంబయ్య, సవర అడ్డాయి, ఎం.తిరుపతి రావు, సవర దొంబు, ఆనందు, శ్రీను వెంకట్రావు, రుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

18 నుంచి సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్

విజయనగరం : సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ తేదీలను మంగళవారం సెట్విజ్ సిఇఒ బి.రామానందం, చీఫ్ కోచ్ అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ క్రీడాంశాల్లో నియోజకవర్గ స్థాయి ఎంపికలు జరుగుతాయని తెలిపారు. స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి ఎంపికలు, పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆవును చంపేసిన పులి

పులి దాడిలో ప్రాంతంలో బోను ఏర్పాటు

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలో పులి సంచరిస్తూ పలు గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. రెండు నెలల వ్యవధిలో ఐదు గ్రామాల పరిధిలో ఐదు ఆవులపై దాడి చేసి చంపేసింది. తాజాగా మంగళవారం వేకువ జామున గరుడబిల్లిలో వెంపడాపు రామ్మూర్తికి చెందిన ఆవుపై దాడి చేసి చంపేసింది. ఆ ఆవు మరో నెల రోజుల్లో ప్రసవించాల్సి ఉంది. దీంతో గ్రామస్తుల్లో భయాందోళన నెలకొంది. వెంటనే అప్రమత్తమైన గ్రామ సర్పంచ్ బొద్దల కృష్ణవేణి గ్రామంలో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కెవిఎన్ రాజు తన సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వేదవతి పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు.

హైస్కూలు విద్యార్థులకు రెండు రోజులు సెలవు

పులి దాడి చేసిన ప్రాంతం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు ఆనుకొని ఉండడంతో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదమూ లేకుండా ముందు జాగ్రత్త చర్యగా రెండు రోజులు పాటు అధికారులు సెలవు ప్రకటించారు. అటవీ శాఖ అధికారుల సూచన మేరకు డిఇఒ సెలవు ప్రకటించారని డిప్యూటీ డిఇఒ కె.వాసుదేవరావు తెలిపారు.



పులిదాడిలో మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజు

పిఎంఎంఎస్‌వై ద్వారా 183 యూనిట్లు ఏర్పాటు

ప్రజాశక్తి కలెక్టర్

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా జిల్లాలో రూ.281.59 లక్షల విలువైన 183 యూనిట్లు మంజూరు చేశారు. సోమవారం కలెక్టరు నిశాంత్ కుమార్ అధ్యక్షతన మత్స్య శాఖ జిల్లా స్థాయి సమావేశం వర్చువల్‌గా నిర్వహించారు. ఈ సమావేశంలో పిఎంఎంఎస్‌వై పథకం 2020-21, 21-22 సంవత్సరానికి గాను రూ.281.59 లక్షల విలువైన 183 యూనిట్లు మంజూరు చేశారు. ఈ పథకంలో మహిళలకు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతుల లబ్ధి దారులకు 60శాతం సబ్సిడీ, జనరల్ కేటగిరిలో 40శాతం సబ్సిడీ పై నిధులు అందజేస్తారు. ఆక్వా హబ్ ఒక యూనిట్ రూ.50లక్షల విలువైన విలువైన ఎంటర్ ప్రైజెస్(ఫిష్ లాంజ్) యూనిట్ ఒకటి, రూ.20 లక్షల విలువైన సూపర్ యూనిట్ ఒకటి, ఫిష్ ట్రాన్స్పోర్టు వాహనాలు ఆరు, రూ.10 లక్షలు విలువైన ఫిష్ కియోస్క్ యూనిట్లు 5, ఐస్ బాక్సుతో కూడిన రెండు చక్రాల వాహనాల యూనిట్లు 54, మూడు చక్రాల యూనిట్లు 18, ఫిష్ ఆంధ్రా మినీ రిటైల్ అవుట్ లెట్స్ 90 యూనిట్లు మంజూరు చేశారు.

వర్చువల్‌గా జరిగిన ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.జి.కృష్ణా జి, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, లీడ్ బ్యాంకు మేనేజరు, వ్యవసాయ, మత్స్యశాఖ మండల అధికారులు పాల్గొన్నారు.



పట్టణంలో చెత్తను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

మూడు షాపులకు జరిమానా

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో పారిశుధ్యం పనులను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం పరిశీలించారు. మూడు షాపుల వద్ద చెత్త ఎక్కువగా ఉన్నందున ఒక్కో షాపునకు రూ.2 వేలు జరిమానా వేయమని, సమయానికి రాని శానిటరీ సెక్రెటరీలకు షోకాజ్ నోటీసులు జారీచేయమని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సిబ్బంది, మెస్త్రీ లు సక్రమంగా పనిచేసి పట్టణాన్ని అందంగా తీర్చిద్దాలని అన్నారు.



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న జట్లు

క్రీడలతో మానసిక వికాసం

ప్రజాశక్తి - సీతంపేట

క్రీడల వల్ల మానసిక వికాసం కలుగుతుందని ఐటిడిఎ ఎపిఒ వై.రోసిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఎలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించిన ఐటిడిఎ స్థాయి క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా ఎపిఒ, డిడిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ క్రీడల వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. డిడి బి.నగేష్ మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ప్రదర్శన చేసి ఐటిడిఎకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఆర్చరీ, షటిల్ బాడ్మింటన్, 100, 200, 800, 1500 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్ ఫుట్, డిస్కస్ త్రో, పాటలు, డ్యాన్స్, డ్రాయింగ్, వ్యాసరచన విభాగాల్లో పోటీలు నిర్వహించారు. తొలుత ముఖ్య అతిధులు జాతీయ జెండా ఎగురవేసి విద్యార్థుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించారు. పోటీల్లో గెలుపొందిన వారికి షీల్డ్స్, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఒఎస్‌డి యుగంధర్, ఎటిడబ్ల్యుఒలు శ్రీనివాసరావు, మంగవేణి, కృష్ణవేణి, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ, జిసిడిఒ రాములమ్మ, జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామకష్ణ, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, పలువురు ఫిజికల్ డైరెక్టర్లు పిఇటిలు పాల్గొన్నారు.

ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురంరూరల్ : ఉపాధ్యాయుల పట్ల అగౌరవంగానూ, మహిళ ఉపాధ్యాయినిల పట్ల అనుచితంగానూ ప్రవర్తిస్తున్న ఎంఇఒపై వెంటనే చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ మండల అధ్యక్షకార్యదర్శులు వి.వసంతనాయుడు, రమణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల శాఖాపరమైన సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ప్రవర్తించడమే కాకుండా, ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. మహిళా ఉపాధ్యాయులను కించపరుస్తూ మాట్లాడడమే కాకుండా, వారిని ఏదో ఒంకతో వేధిస్తున్నారని తెలిపారు. ఎంఇఒను కలిసిన ఉపాధ్యాయులపట్ల బెదిరిస్తూ మాట్లాడడమే కాకుండా, వారి ఇన్‌కంటేక్స్‌ను పొంతనలేకుండా కోత విధిస్తున్నారని ప్రకటనలో తెలిపారు. పై అధికారులు ఈ విషయంపై స్పందించి, తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిచో పోరాటం చేస్తామని ప్రకటనలో తెలిపారు.



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

పంట కోతపంట ప్రయోగాన్ని ఆర్‌డిఒ పరిశీలన

సీతానగరం : మండలంలోని కోట సీతారాంపురంలో ఆర్లపల్లి రాము అనే రైతు పొలంలో వరి 5×5 పంట కోత ప్రయోగం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 28 వరి పంట కోత ప్రయోగాలు నిర్వహించామన్నారు. ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్ తీసుకొని యూనిట్‌గా వచ్చిన దిగుబడి ఆధారంగా పంటల బీమా మొత్తం గ్రామ యూనిట్‌గా తీసుకోబడతాయన్నారు. ఈ ప్రయోగంలో 13.28 కేజీల ధాన్యం వచ్చాయని తెలిపారు. పంటలు ఇన్సూరెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ ఎంవి రమణ, మండల వ్యవసాయాధికారి అవినాష్, జిల్లా గణాంకాధికారి కె.జయప్రకాష్, తదితరులు ఉన్నారు.

మధ్యాహ్నం భోజనం పథకం పరిశీలన

సీతానగరం : మండలంలోని పలుకుపేట, గాదిలివలసలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సూచించారు. వంటశాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం గాదిలివలస సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆయన వెంట ఎంఇఒ జి.సూర్యదేముడు, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


సినీ నటుడు కృష్ణకు నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే కళావతి, అభిమానులు

సినీనటుడు కృష్ణకు ఎమ్మెల్యే నివాళి

పాలకొండ : సీనియర్ సినీ నటుడు ఘట్టమనేని కృష్ణకు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి మంగళవారం నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సినీ నటుడిగానే కాకుండా పార్లమెంట్ సభ్యునిగా అనేక సేవలందించారని, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విజయగాథను వెండి తెరమీదకు ఎక్కించిన ఘనత ఆయనదేనని అన్నారు. ఆమెతో పాటు పాలకొండ పట్టణ సూపర్ స్టార్ కృష్ణ అసోసియేషన్ అధ్యక్షులు లిల్లీ పుష్పనాథం, పట్టణ ప్రధాన కార్యదర్శి కడగల వెంకటరమణ, వైసిపి పట్టణ అధ్యక్షులు వెలమల మన్మధరావు, కౌన్సిలర్ మోహన్ రావు, కొండదాడి మధుబాబు, ముద్దాడ చక్రవర్తి, మోహనరావు, గురుబిల్లి రవి, యమాల ఈశ్వరరావు, పలువురు కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫీజు గడువు పెంపు

కలెక్టరేట్ : ఈ ఏడాది జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ఫీజు గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు డిఇఒ ఎస్‌డివి రమణ తెలిపారు. పూర్తి వివరములకు సంబంధిత ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్ సైటు www.bse.ap.gov.inలో గానీ, జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా కోరారు.


పేదలకు చీరలు అందజేస్తున్న రాఫా ఫౌండేషన్ సభ్యులు

మహిళలకు చీరలు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ పంచాయతీ పరిధిలో గల చాపరాయి, జంగిడిభద్రలో గల 41 మంది గిరిజన మహిళలకు రాఫా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాఫా డైరెక్టర్ ప్రవీణ్ కంటి మహంతి, ప్రతినిధులు గంటా పెంటయ్య, మీసాల శోభన్ బాబు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంతో మహిళలకు ఆర్థిక భరోసా

కురుపాం : పెరటి తోటల పెంపకంతో మహిళలకు ఆర్థిక భరోసాతో పాటు పౌష్టికరమైన ఆహారం లభించడానికి పెరటితోటలు ఎంతో దోహదం పడతాయని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఉమాజ్యోతి అన్నారు. మంగళవారం పెరటితోటల విధానంలో సూర్యమండలం నమూనా గురించి మహిళలకు అవగాహన కల్పించి, కూరగాయల నారును నాటించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డా.శ్రీనివాసరాజు, అమ్మతవేణి, రైతులు పాల్గొన్నారు.

నిడగల్లులో స్ప్రింగ్ స్ప్రేయింగ్

సీతానగరం : మండలంలోని నిడగల్లులో మంగళవారం దోమల నివారణకు పంచాయతీ కార్యదర్శి పి.తిరుపతిరావు ఆధ్వర్యంలో స్ప్రింగ్ స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం పనులు, దోమల నివారణ పిచికారి మందు చేయించామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవోదయలో తిరుమల సాయి విద్యార్థులకు మరో మూడు సీట్లు

జియ్యమ్మవలస : నవోదయ విద్యాలయం నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షల్లో పెదమేరంగిలో గల తిరుమల సాయి విద్యానికేతన్‌కు చెందిన మరో ముగ్గురు విద్యార్థులకు సీట్లు లభించాయి. తిరుమల సాయిలో చదివిన పెదమేరంగికి చెందిన వాకాడ లీలారాణి, రాజులగుమ్మడకు చెందిన దత్తి నిహారిక, అర్నాడ చరణ్‌తేజకు నవోదయ పాఠశాలలో సీట్లు లభించాయి. కరస్పాండెంట్ రౌతు సరసకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులకు మిఠాయి తినిపిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు

పుస్తకాలతో జీవితాల్లో మార్పు

ప్రజాశక్తి - సీతంపేట

పుస్తకాలు మనిషి జీవితంలో మంచి మార్పులు తీసుకొస్తాయని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. మండలంలోని పెద్దూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలు మంచి నేస్తాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. తొలుత పెద్దూరు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంఇఒ ఆనందరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు గోవింద నాయుడు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలు వినియోగించుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదివి సమయాన్ని వినియోగించి భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. పుస్తక పఠనం వల్ల మనకు తెలియని ఎన్నో విషయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, డ్రాయింగ్ మాస్టర్ గౌరిష్, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పెదకాపువీధి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జామి రవి ఈ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలు వినియోగించుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలు చదివి సమయాన్ని వినియోగించి భవిష్యత్తు తీర్చిదిద్దు కోవాలన్నారు. పుస్తక పఠనం వల్ల మనకు తెలియని ఎన్నో విషయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ జి.తిరుపతిరావు, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ కె.గడ్డయ్య, ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక శాఖాగ్రంథాలయంలో 55 వ జాతీయ గ్రంథాలయ దినోత్సవ వారోత్సవాలను లైబ్రేరియన్ శ్రీను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులు పాటు ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. పుస్తక పఠన ప్రాముఖ్యత, గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులైన ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య తదితరులను స్మరించుట, కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీలు, దిశ చట్టం, మహిళా సాధికారికతపై చర్చ, డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సాముహిక స్వీయపఠనము లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.


కురుపాం : వారోత్సవాలను ప్రారంభిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

భామిని : స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ సునీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను తహశీల్దార్ అప్పారావు ప్రారంభించారు. పుస్తక పఠనం రోజు వారి కార్యక్రమంగా విద్యార్థులు అలవార్చు కోవాలని, పేదలను సైతం గొప్పవాడిగా చేసే ఆయుధం పుస్తకమని, విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. భామిని ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు గోపాలరావు మాట్లాడుతూ చారిత్రక పుస్తకాల్లో ఎంతో విలువైన సమాచారం ఉందని, విద్యార్థులు అటువంటి పుస్తకాలు చదవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం పాఠశాల హెచ్ఎం రవి, సన్యాసి రావు, మురళి ఉన్నారు.


సీతంపేట : విద్యార్థులతో కలిసి సహపంక్తిభోజనం చేస్తున్న ఎంపిడిఒ గీతాంజలి


భామినిలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న తహశీల్దార్ అప్పారావు

గృహ నిర్మాణాల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నవరత్నాలు ప్రజలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ సమావేశ మందిరంలో నియోజకవర్గంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించి మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, కమిషనర్ జె.రామఅప్పలనాయుడు సమక్షంలో 15 సచివాలయాల కార్యదర్శులు, విఆర్‌ఒలతో కలిసి సమీక్షా సమావేశంలో పాల్గొని 17 లేఅవుట్లలో చేపట్టిన గృహ నిర్మాణ ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హుడైన ప్రతి లబ్ధిదారుడు ఇళ్లు కట్టుకొనేలా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూసేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. అందులో భాగంగానే ఇంటి స్థలం వచ్చిన ప్రతి లబ్ధిదారులు వాటి ఫలాలు పొందేలా సత్వరమే ఇళ్ల నిర్మాణం ప్రారంభించి పూర్తి చేసుకోవాలని అన్నారు. అందుకు అవసరమైన చర్యలు, గృహనిర్మాణ శాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా కృషి చేయాలని అన్నారు. మున్సిపాల్టీ పరిధిలో 17 లేఔట్లలో ఎంతమంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు, అందులో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, ఇంకా ఎన్ని ఇళ్ల నిర్మాణం ప్రారంభించాల్సి ఉంది అన్న అంశాలపై ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలచే లేఔట్ల వారీగా సచివాలయం వారీగా పూర్తి స్థాయి సమీక్ష జరిపారు. సమీక్షలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ ఇండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, హౌసింగ్ ఎఇ ఆనంత్, సచివాలయాల సెక్రటరీలు, వీఆర్వోలు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో గ్యాస్ వినియోగం, భద్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిసిసి బ్రాంచ్ మేనేజర్ వి.కృష్ణప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో గ్యాస్ వినియోగం, వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలను తమ సంస్థ సిబ్బందిచే అవగాహన పరుస్తున్నట్లు చెప్పారు. గిరిజన గ్రామాల్లో చాలావరకు గ్యాస్ వినియోగం ఏ విధంగా చేయాలి, భద్రతా చర్యలు ఎలా చేపట్టాలో తెలియక వినియోగదారులు గ్యాస్‌ను తగువిధంగా వినియోగించడంలేదని అన్నారు. ఈ మేరకు వినియోగదారులు ఎల్పిజి సిలిండర్ వాడేవారు వంటగదిలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. గ్యాస్ వినియోగించేటప్పుడు వంట గదిలోకి గాలి, వెలుతురు వచ్చే కిటికీలను తెరిచి ఉంచాలని అన్నారు. కిరోసిన్, పెట్రోల్, డీజిల్ వంటి వాటిని గ్యాస్ పక్కన ఉంచకూడదని, గ్యాస్ స్టవ్‌కు ఎదురుగా కిటికీ ఉండకూడదని అన్నారు. అలాగే వినియోగదారులు గ్యాస్ సిలిండర్లలకు, స్టవ్‌లకు సొంత మరమ్మతులు చేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏదైనా లీకేజీ సమస్యలుంటే వెంటనే రెగ్యులేటర్‌ను ఆపి, సంబంధిత జిసిసి డిస్ట్రిబ్యూటర్‌ను సంప్రదించాలని కోరారు. అలాగే వినియోగదారులు నాణ్యమైన గ్యాస్ స్టవ్ లను వాడి, ఎక్కువ కాలం గ్యాస్‌ను వినియోగించడం వంటి చర్యలు తీసుకోవాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో ఇండేన్ గ్యాస్ సిబ్బంది జి.రాజేంద్ర, టి.లక్ష్మణరావు, గ్యాస్ ఇంచార్జ్ సంఘం నాయుడు తదితర సిబ్బంది ఉన్నారు.

సాంస్కృతిక పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజావక్తి - సీతంపేట

రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలకు పలువురు గిరిజన విద్యార్థులు ఎంపికైనట్లు ఎఎంఒ పి.కోటిబాబు తెలిపారు. వ్యాసరచన పోటీకి పెద్దమడి పాఠశాలకు చెందిన ఎస్.నందిని, జయపురం పాఠశాలకు చెందిన ఎస్.సుమంత్ ఎంపికయ్యారు. వక్తృత్వ పోటీలకు భీంపురం, చిన్నబగ్గాకు చెందిన దుర్గాభవానీ, చైతన్య ఎంపికయ్యారు. అలాగే పాటల పోటీలకు సీతంపేటకు చెందిన నందిని, చిన్నబగ్గకు చెందిన ఇస్మాయిల్, చిత్రలేఖనం పోటీలకు పూతికవలస, సీతంపేటకు చెందిన అంజలి, మనోహర్ ఎంపికయ్యారు. డ్యాన్సుల పోటీలకు సీతంపేట చెందిన గ్రూపులు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల విశాఖలో 19,20,21 జరగబోతున్న రాష్ట్ర స్థాయిపోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : విశాఖలో ఆర్‌కె బీచ్ వద్ద మూడు రోజుల పాటు జరుగు గిరిజన గౌరవ ఉత్సవాలకు గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతం నుంచి ఆదివాసీ గిరిజన నృత్య కళాకారులు పాల్గొన్నారు. సోంబర మాస్టర్ ఆధ్వర్యంలో ఐటిడిఎ అధికారులు నృత్య కళాకారులను పంపించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక ఐసిడిఎస్ పరిధిలో గల అంగన్వాడీ హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రూరల్ ప్రాజెక్ట్ సిడిపిఒ సుగుణకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ హెల్పర్‌కు నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సు ప్రభుత్వ ఉద్యోగుల వలే పెంచాలని, రిటైర్మెంట్ తర్వాత రూ.3లక్షలు అందించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, తెలంగాణ వలే మన ప్రభుత్వం కూడా జీతం పెంచి ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు ప్రతి ఏటా విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్వై నాయుడు, యూనియన్ నాయకులు నిర్మల, గౌరీ, ధనలక్ష్మి, అక్కమ్మ పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: అంగన్వాడి కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బుక్కురు అంగన్వాడి కేంద్రం- 1, 2 కార్యకర్తలు బుక్కూరు గ్రామ సచివాలయ సెక్రెటరీ పి.ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త ఎన్.హిమ ప్రభ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.


సాలూరులో సిడిపిఒకు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

కుష్టు వ్యాధి గుర్తింపునకు ఇంటింటి సర్వే

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

కుష్టువ్యాధి గుర్తింపుపై పట్టణం సర్వే కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ ఇన్‌ఛార్జి అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పర్యవేక్షించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి వచ్చే నెల 5 వరకు ఈ వ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానికులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా చర్మంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, లావుగా నొప్పితో కూడిన నరాలు, చేతులు, పాదాలు తిమ్మిర్లు, నొప్పి తెలియని పుండ్లు చేతులు, పాదాలపై ఉండటం మొదలగు లక్షణాల ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ వ్యాధికి సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే ఈ వ్యాధి ద్వారా అంగ వైకల్యం(లెప్రోసీ గ్రేడ్ -2) ఉన్న వారికి ప్రభుత్వం పెన్షన్ అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పెదలంకలాం, సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు రాధా క్రాంతి, శిరీష, ఉషారాణి ఆధ్వర్యంలో కుష్టువ్యాధి గుర్తింపుపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం నుంచి డిసెంబర్ 5 వరకు ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇంటికి ఆశా వర్కర్, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు తిరిగి ఇంట్లో అందరికీ పరీక్షలు చేసి ఎవరికైనా మచ్చలు ఉంటే తెలుసుకొని ఏ రకమైన మచ్చలు ఉన్నాయో గుర్తించి తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ హెచ్ ఏఎన్ఎం లో పాల్గొన్నారు.



పార్వతీపురంలో కుష్టు వ్యాధి సర్వే చేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహన్‌రావు

రోడ్డు ప్రమాదంలో బొన్నాడ మృతి

మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సాలూరు



తమిళనాడులోని అరుణాచలం తీర్థయాత్రకు కారులో వెళ్తుండగా పోలూరు ఫ్లైఓవర్ వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి వైసిపి నాయకులు బొన్నాడ శ్రీనివాసరావు మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం దర్శనం చేసుకుని అరుణాచలం ఆలయం దర్శనానికి కారులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో కారు వంతెన పై నుంచి కిందకి పడిపోయింది. ఈ ప్రమాదంలో పారమ్మ కొండ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ బొన్నాడ శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందారు. పట్టణానికి చెందిన వ్యాపారవేత్త రవ్వా శ్యాం కుమార్ తీవ్ర గాయాలతో చెన్నయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన తెలుసుకున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి తమిళనాడులోని ప్రమాదం జరిగిన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడాలని ఆదేశించారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని తొందరగా సాలూరుకు పంపించే ఏర్పాట్లు చేయాలని కోరారు. శ్రీనివాసరావు మృతి పట్ల ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తీవ్రంగా గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

బాలల హక్కుల గోడ పత్రిక ఆవిష్కరణ


ప్రజాశక్తి - పాలకొండ

అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు సందర్భంగా యూనిసెఫ్ - సార్డ్ - ఎఐఐబి - జగనన్న స్వచ్ఛ సంకల్ప వారి సౌజన్యంతో జన చేతన ఆధ్వర్యంలో స్థానిక శ్రీసిరి ప్రైవేట్ పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జన చేతన కార్యదర్శి బగాది శశిభూషణచౌదరి మాట్లాడుతూ అంత్జాతీయ బాలల హక్కుల ఒడంబడిక (యుఎన్‌సిఆర్‌సి) 1989 నవంబర్ 20న జరిగిన సందర్భంగా నవంబర్ 14 నుంచి 20 వరకూ వారోత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. పాఠశాల విద్య, బాలల హక్కులైన జీవించే - రక్షణ - అభివృద్ధి - భాగస్వామ్య హక్కులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వారం రోజులు పాటు విద్యా సంస్థలు, సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సంఘాలకు పలు కార్యక్రమాల ద్వారా బాలల హక్కులపై చైతన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆనంతరం క్రాఫ్ -రెపిప్రో చైల్డ్ గ్రూప్ రూపొందించిన గోడ పత్రిక ఆవిష్కరించడంతో పాటు పాఠశాల బాల, బాలికలకు చైల్డ్ రైట్స్‌పై పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు పడాల రవి కుమార్, ఉపాధ్యాయులు బి.ప్రమీల, పి.కొండలరావు, డి.రాము, మోహనరావు, ఫెసిలిటేటర్ ఎం.సరస్వతి, పాఠశాల బాలలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రాణాలు కాపాడిన యువకుడు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఓ యువకుడు రక్తదానం చేసి గిరిజన చిన్నారికి ప్రాణాలు కాపాడ్డాడు. కొమరాడ మండలం సర్వాపాడుకు చెందిన హిమరిక మాధురి (3)ని ప్రాణాపాయ స్థితిలో స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈమెకు అరుదైన ఎబి(పాజిటివ్) రక్తం అవసరం కాగా, పట్టణంలో మేదరి వీధికి చెందిన ఆరి పార్థుది రక్తదానం చేసి మాధురి ప్రాణాలు కాపాడారు. ఆయన్ను రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎం.శ్రీరాములు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కాగా మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు , సిరియాల శ్రీనివాసరావు, బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్ మజ్జి మధు, నందిగాన ముని సాయి, సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, రోగి కుటుంబీకులు అభినందించారు..


రక్తదానం చేస్తున్న పార్థు

జెవివి జిల్లా కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక మన్యం జిల్లా కమిటీ మంగళవారం ఏర్పాటైంది. స్థానిక పంచాయతీరాజ్ డివిజనల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులుగా ఎం.రత్నకుమార్, ప్రధాన కార్యదర్శిగా డి.చంద్రమౌళి, కోశాధికారిగా ఎండి ఫరూక్, ఉపాధ్యక్షులుగా కెవి నాగేశ్వరరావు, కె.చిన్నారావు, సంయుక్త కార్యదర్శులుగా సిహెచ్ సీతారాం, కిల్లక రాజు, తాడంగి సాయిబాబు, పల్ల సురేష్, కమిటీ సభ్యులుగా వి.శ్రీనివాసరావు, జి.చంద్ర మౌళి, కిల్లక పోలారావు, తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జెవివి జాతీయ నాయకులు ఎంవిఆర్ కృష్ణజీ మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేసి, ఈమన్యం ప్రాంతాల్లో శాస్త్రీయ ఆలోచన పెంపొందించే విధంగా వేదిక పనిచేయాలని సూచించారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రఘురాం లబ్ధిదారులను కోరారు. మండలంలోని పెదబోగిలి మేజర్ పంచాయతీలో జగనన్న లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాలు మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ లేఅవుట్లలో ఇళ్లను లబ్ధిదారులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణం కావాల్సిన సామాగ్రిని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు కాలనీలో నిర్మాణం చేపట్టేందుకు అన్ని విధాలా సాయం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ జానకిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పి.కృష్ణ, పి.సత్యంనాయుడు, లబ్ధిదారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణాలకు సన్నాహాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకంపేట ఘోరీల నుంచి ఆంధ్రా-ఒడిషా సరిహద్దుల వరకూ ఆర్అండ్‌బి పరిధిలో రూ.17కోట్లకు పైగా నిధులతో నిర్మించబోయే రహదారి పనుల్లో భాగంగా మంగళవారం చినబొండపల్లి, ఎమ్మార్‌నగరంలో రహదారికిరువైపుల కాలువల నిర్మాణానికి జెఇ ప్రమీల ఆధ్వర్యంలో కొలతలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, గండి శంకరరావు, వంగపండు త్రినాధ నాయుడు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా మురుగుపోవడానికి సరైన కాలువల్లేక ప్రధాన రహదారిపైనే మురుగునీరు చేరేదని, కాలువల నిర్మాణం వల్ల మురుగునీటి సమస్య తీరనున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు.

నేత్ర శస్త్ర చికిత్సకు వృద్ధులు ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో ఇంత వరకూ నిర్వహించిన వైఎస్ఆర్ అవ్వాతాత కంటి వెలుగు నేత్ర పరీక్షలు నిర్వహించారు. కేటరాక్ట్(అంతర కుసుమం) టేరిజియం (కొయ్యకండ) ఉన్న 30మందికి మంగళవారం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు నేత్ర వైద్య అధికారి డాక్టర్ నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వైద్యులు శోభారాణి, కంటి వైద్య సహాయకులు రోజా, మాలిక, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.


నేత్ర శస్త్రచికిత్సకు వెళ్తున్న రోగులు